ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 పార్వతీపురం మన్యం జిల్లా వార్తలు

ఆదివారం 24 నవంబరు 2024



విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: డీఎంవో

కురుపాం,నవంబరు23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ప్రత్యేంగా శ్రద్ధ వహించాలని జిల్లా మలేరియా అధికారిణి మణి ఆదేశించారు. శనివారం శివ్వన్నపేటలో ఏపీ గురుకుల బాలికల రెసిడెన్సియల్ ఉన్నత పాఠశాల, కళాశాలను సందర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ప్రిన్సిపాల్ సత్యవతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. వైద్య పరీక్షలు చేయించి క్రమం తప్పకుండా మందులు వాడించాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

శిలాఫలకాలతోనే సరి..



సాలూరులో శిలాఫలకం ఇలా..

పార్వతీపురం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గత వైసీపీ ప్రభుత్వం హయాంలో నాయకులు ఎంతో హడావుడిగా శిలాఫలకాలు ఆవిష్కరించారు. అయితే పనులు మాత్రం పూర్తి చేయించలేకపోయారు. నాటి సర్కారు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. చివరకు శిలాఫలకాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి 2018లో ఈ నిధులను అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఇంతలోనే ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టడంతో ఆ పనులు త్వరితగతిన పూర్తవుతాయని ఆశించిన జిల్లా వాసులకు నిరాశే మిగిలింది. నేటికీ తాగునీటి కష్టాలు తప్పడం లేదు. జిల్లాలోని సాలూరు, పార్వతీపురం , పాలకొండలో పరిస్థితిని పరిశీలిస్తే..

- తాగునీటి సమస్య పరిష్కరిస్తామని గత వైసీపీ సర్కారు గొప్పలు
- హడావుడిగా శంకుస్థాపనలు చేసిన నాటి పాలకులు
- సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిన పనులు
- ప్రస్తుతం పెరిగిన అంచనా వ్యయం.. ప్ర'జల'కు తప్పని కష్టాలు



గత వైసీపీ సర్కారు హయాంలో...

● జిల్లా కేంద్రం పార్వతీపురంలో ప్రజల తాగునీటి కష్టాలు తీర్చేందుకు గత వైసీపీ పాలకులు 2022, సెప్టెంబరు 14న మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోనే శిలాఫలకం ఆవిష్కరించారు. ఏఐబీ సహకారంతో సుమారు రూ.63.63 కోట్లతో మెగా రక్షిత నీటి పథకం పనులు చేపడుతున్నట్లు గొప్పలు చెప్పారు. ప్రజల దాహార్తిని పూర్తిస్థాయిలో తీరుస్తున్న ఘనత అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని వైసీపీ నాయకులు ప్రసంగించారు. అయితే పనులు మాత్రం పూర్తి చేయించలేక పోయారు. కాగా ఈ నిధులపై ఏ అధికారి కూడా స్పష్టత ఇవ్వడం లేదు.

● సాలూరులో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అప్పట్లో రూ.68.98 కోట్లు మంజూరైంది. అయితే పనులు మాత్రం పూర్తవ్వలేదు. పాచిపెంట మండలం పెద్దగెడ్డ ప్రాజెక్టు నుంచి పట్టణానికి నీటిని మళ్లించాలని భావించారు. ఈ మేరకు 2022, సెప్టెంబరు 10న, స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో వైసీపీ నాయకులు హడావుడిగా శిలాఫలకం ఆవిష్కరించారు. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

● పాలకొండలో రక్షిత నీటి పథకం ఏర్పాటు, పైప్‌లైన్ల విస్తరణకు గతంలో రూ.57 కోట్లు మంజూరైంది. అయితే గత ప్రభుత్వ హయాంలో సుమారు ఆరు కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు మాత్రమే చేపట్టారు. ఇందుకోసం రూ.2 కోట్లు వెచ్చించినట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఇక రక్షితనీటి పథకం పనులైతే ప్రారంభానికి నోచుకోలేదు.

పెరిగిన అంచనా వ్యయం

పార్వతీపురం, సాలూరు, పాలకొండలో తాగునీటి సమస్యను పరిష్కారం కోసం సుమారు రూ.180 కోట్లతో ప్రారంభించిన పనులు పూర్తికాకపోవడంతో 40 శాతం మేర అంచనా వ్యయం పెరిగింది. అధికారులు ప్రతిపాదనలు పంపించేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రతిపాదనలకు మోక్షం లభిస్తే పనులు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లాలోని ప్ర'జల' కష్టాలు తీరనున్నాయి.

అన్ని కాలాల్లోనూ ఇబ్బందులే..

జిల్లాకేంద్రం పార్వతీపురంలో ప్రజలు అన్ని కాలాల్లోనూ తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. వేసవి కాలంలో మూడు, నాలుగు రోజులకొకసారి నీటి సరఫరా జరగ్గా, వర్షాకాలంలో అయితే కొళాయిల ద్వారా బురదనీరు సరఫరా

(మిగతా 8వ పేజీలో...)



పార్వతీపురంలో ఆవిష్కరించిన శిలాఫలకం ఇలా...

మన్యంలో చలిపులి

● 17 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు



6లో

తోటపల్లికి పోటెత్తిన భక్తులు

● మార్మోగిన గోవింద నామస్మరణ

6లో

శంకరరావు మా'స్టారు'

● వినూత్న బోధన ఆయన సొంతం

● పాఠాల పాటలతో పులకిస్తున్న విద్యార్థులు

6లో

విదేశాల్లో ఉద్యోగావకాశాల కోసం శిక్షణ

పార్వతీపురం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): జర్మనీ దేశంలో ఉద్యోగావకాశాల కోసం నిరుద్యోగ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూరా పర్సనల్ భాగస్వామ్యంతో జర్మనీలో పనిచేయాలనుకునే నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాష నేర్పించడంతో పాటు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జీఎన్‌ఎం, బీఎస్సీ, నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన 35 ఏళ్ల వారు అర్హులన్నారు. ఆరు మాసాల పాటు తిరుపతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వీసా పొందిన తర్వాత అభ్యర్థులు రూ.75 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు ఈ 96769 65949 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అటవీ అభివృద్ధికి చర్యలు

● డీఎఫ్‌వో ప్రసూన

కురుపాం,నవంబరు23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటవీ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారిణి ప్రసూన తెలిపారు. శనివారం కురుపాం అటవీశాఖ రేంజ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రిజర్వుడ్ ఫారెస్టు, వివిధ పథకాల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అటవీ సంరక్షణే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అటవీ ప్రాంతంలో సుమారు పది హెక్టర్లలో మొక్కలు నాటడానికి అవసరమైన ప్రదేశాన్ని పరిశీలించడానికి వచ్చినట్లు తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ అధికారులు గంగరాజు, మణికంఠేశ్వరరావు, సెక్షన్ అధికారి సూర్యప్రకాష్, బీట్ అధికారులు, ఏబీవోలు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

బాబా స్ఫూర్తితో ముందుకు సాగాలి

● సత్యసాయి జయంత్యుత్సవాల్లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : భక్తి మార్గమే ప్రతి ఒక్కరి జీవన మార్గం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సత్యసాయి జయంత్యుత్సవాల సందర్భంగా శనివారం కంచరవీధి బాబా మందిరంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మానవ సేవే మాధవ సేవ అన్న సత్యసాయి సూక్తిని అందరూ ఆచరించాల్సిన అవసరముందన్నారు. బాబా స్ఫూర్తితో ముందుకు నడవాలని, సుందర పార్వతీపురంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

27న బాల వివాహ ముక్త్ భారత్‌కు శ్రీకారం

పార్వతీపురం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 27న 'బాల వివాహ ముక్త్ భారత్' నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాల్య వాహాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, హెల్పర్లు, ఏఎన్‌ఎం, ఆరోగ్య కార్యకర్తలు, పోలీసులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు ఇందులో భాగస్వాములవ్వాలని కోరారు. జిల్లా, డివిజనల్, మండల, గ్రామ స్థాయిల్లో బాల్య వివాహాల నిషేధ అధికారులను నియమించనున్నామన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు నోడల్ అధికారులుగా ఉంటారని తెలిపారు.

ఆధార్ లింక్‌పై అవగాహన

● జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి రామ్‌గోపాల్

సీతంపేట రూరల్,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులంతా విధిగా ఆధార్‌కు బ్యాంక్ ఖాతా లింక్ చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి బి.రామ్‌గోపాల్ ఆదేశించారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్‌పీసీఐ బ్యాంక్ ఖాతాలు, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ చేసుకోని వారు ఈ నెల 30లోగా ఆ పనిని పూర్తిచేయాలని సూచించారు. రూ.200కే తపాలా బ్యాంక్ ఖాతా తెరిచే అవకాశం ఉన్నందున దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, లోకేషన్ సర్వే, పాఠశాల తనిఖీల్లో పురోగతి సాధించాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల హాజరు తప్పనిసరిగా ఉండాలని, రోజూ ఏపీ సేవా సర్వీస్ ద్వారా నగదు చెల్లింపులు ఉండాలని తెలిపారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికి రాదన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గీతాంజలి, ఏవో మాస తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సచివాలయ ప్రత్యేకాధికారి రామ్‌గోపాల్

48 గంటల్లోనే..

● ధాన్యం బిల్లుల చెల్లింపు

● రైతుల ఖాతాలకు నగదు జమ

● ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం



పార్వతీపురం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటించినట్లుగానే ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోపే బిల్లులు చెల్లించింది. వారి ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. ఇటీవల పార్వతీపురం మండలం పెదబండపల్లి గ్రామానికి చెందిన ఎం.ధనుంజయనాయుడు సుమారు రూ.1.38 లక్షల విలువైన ధాన్యం విక్రయించారు. అయితే నిర్ణీత గడువులోపే ఆయన బ్యాంకు ఖతాకు నగదు జమైంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ సర్కారు హయాంలో ధాన్యం విక్రయించిన తర్వాత నగదు కోసం ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలోఆ పరిస్థితి లేదన్నారు. కాగా జిల్లాలో 301 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు సంబంధించి సేవలు అందిస్తున్నారు. ఇందులో 71 ఆర్‌ఎస్‌కేల్లో షెడ్యూలింగ్ ప్రారంభమైంది.

బకాయిలు జమ...

గత ప్రభుత్వం రైస్ మిల్లర్లకు బిల్లులు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో బ్యాంకు గ్యారెంటీల్లో ఈ సొమ్మును కలుపుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తంగా 93 మిల్లులకు సంబంధించి రూ. 4.90 కోట్లు బ్యాంకు గ్యారెంటీ కింద మినహాయించారు. ఇదిలా ఉండగా జిల్లాలో మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 16 మిల్లులకు సంబంధించి రూ. 7.97 కోట్లు విలువైన 21 బీజీలు అందాయి. గత ఏడాది మిల్లర్లకు చెల్లించాల్సిన రూ.4.90 కోట్లు కలుపుకొని ఇప్పటివరకు జిల్లాలో రూ.12.87 కోట్ల మేర బ్యాంకు గ్యారెంటీలు అందాయి.

ముమ్మరంగా కొనుగోలు

జిల్లాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతల్లో సొమ్ము జమవుతుంది. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

- శ్రీనివాసరావు, డీఎం, సివిల్ సప్లైస్

సరుకులన్నీ ఒకేసారి సరఫరా

● డిపోలకు నిత్యావసరాల పంపిణీపై జేసీ ఆదేశం

సాలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోలకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులన్నీ ఒకేసారి సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ శోభిక ఆదేశించారు. శనివారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇప్పటివరకు ఎన్ని డిపోలకు సరుకులు సరఫరా చేశారని సీఎస్‌డీటీ రంగారావును ప్రశ్నించారు. డిపోలకు పంపించే సరుకుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. డీలర్ల సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ సరుకులు అందించాలని సూచించారు. అనంతరం ఎంఎల్‌ఎస్ గోదామును పరిశీలించి సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సాలూరుకు ధాన్యం పంపే ఏర్పాట్లు చేస్తాం

సాలూరు రూరల్: శివరాంపురం పీఏసీఎస్ కొనుగోలు కేంద్ర పరిధిలో ధాన్యం సాలూరు మిల్లుకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తామని జేసీ శోభిక తెలిపారు. శివరాంపురంలో ధాన్యం కొనుగోలును పరిశీలించారు. మిర్తివలస, కొట్టక్కి మిల్లులు విజయనగరం జిల్లా పరిధిలో ఉన్నందున అక్కడికి ఈ గ్రామ ధాన్యం పంపడానికి వీలుకాదని రైతులకు తెలిపారు.




అధికారులతో మాట్లాడుతున్న జేసీ శోభిక

ఉరితాడు తగిలించుకుని..

● అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల వినూత్న నిరసన

పార్వతీపురం/బెలగాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు మెడకు ఉరితాడు తగిలించుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ ఎదుట వారు చేపట్టిన దీక్ష నాలుగో రోజుకు చేరింది. శనివారం వారు మాట్లాడుతూ.. కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సీఆర్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నుంచి తాము పని చేస్తున్న పోస్టులను మినహాయించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వీరి ఆందోళనకు సీపీఎం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు ఎం.కృష్ణమూర్తి, రంజిత్ కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల కృష్ణారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు మద్దతు తెలిపారు.





రామతీర్థంలో మబ్బుల సోయగం

మేఘాలు గొడుగు పట్టినట్టు!

సువిశాలమైన కొండ.. ఆ కొండపై రామాలయం... ఆ ఆలయానికి గొడుగు పట్టినట్టుగా మేఘాల సమూహం. మనసులను ఆహ్లాదపరిచే ఈ దృశ్యాలు రామతీర్థం శేషాచలం కొండ పరిసరాల్లో శనివారం కనిపించాయి. రామతీర్థం, సీతారాముడుపేట చుట్టూ పచ్చని పైర్లతో ప్రకృతి దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

- విజయనగరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి)



శేషాచలం కొండపై గల రాముని ఆలయంపై మబ్బుల పందిరి

మన్యంలో చలిపులి

- 17 డిగ్రీలకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు

పాలకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. నిన్న మొన్నటి వరకు వర్షాకాలంలో కూడా ఎండ తీవ్రత 40 డిగ్రీల వరకు కొనసాగింది. గత నాలుగు రోజులుగా జిల్లాలోని అన్ని మండలల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు గడిచిన నాలుగు రోజుల్లో గరిష్ఠంగా 30 డిగ్రీల వరకు ఉండగా... కనిష్ఠం 17 డిగ్రీలకు పడిపోయింది. వీటితో పాటు చలిగాలులు పెరగడంతో అన్ని వయసుల వారూ ఇబ్బంది పడుతున్నారు. సీతంపేట, భామిని, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సాలూరు, పాచిపెంట తదితర మండలాల్లో రాత్రి వేళల్లో 15 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయినట్టు తెలుస్తోంది. దీనితో సాయంత్రం ఐదు నుంచి ఉదయం 8 గంటల వరకు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. తెల్లవారుజామున రెండు, మూడు నుంచి ఉదయం ఏడు గంటల వరకు మన్యం జిల్లా అంతటా మంచు దుప్పటి కమ్ముకుంటోంది. ఆ సమయంలో రహదారులపై వాహనాల హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణం సాగిస్తున్నారు. నవంబరు నెలలోనే చలి తీవ్రత ఇలా ఉంటే డిసెంబరు, జనవరిలో ఏ స్థాయిలో ఉంటుం దోనని బెంగ పెట్టుకుంటున్నారు.




చలి తీవ్రతకు పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మూగజీవాలు ఇలా...

ఆస్తమా బాధితులు జాగ్రత్త

ఆస్తమా, న్యూమోనియా, సీవోపీడీ, గుండె వ్యాధులతో బాధపడే వారికి చలికాం కష్టమేనని వైద్యులు అంటున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా.. చల్లటి ఆహారం తీసుకున్నా... ఏసీ గదుల్లో ఉన్నా ఆస్తమా సమస్య పెరుగుతుంది. చలికాలంలో దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తే ఆస్తమా, న్యూమోనియా రోగులకు మరింత అసౌకర్యంగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆస్తమా, న్యూమోనియాతో బాధ పడేవారు మందులు వాడకపోతే సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వ్యాధుల ముప్పు

చల్లటి వాతావరణంతో జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఆయాసం, సైనస్‌ కేసులు పెరిగే అవకాశం ఉంది. ఆస్తమా, అలర్జీ, న్యూమోనియా తదితర వ్యాధుల ముప్పు పొంచి ఉంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పులతో చల్లటి గాలులలకు శరీరం తెల్లగా పొడిబారినట్టు మారిపోతుంది. పెదవులు పగిలిపోయి ముఖం కాంతిహీనంగా మారుతుంది. అరికాళ్లు పగుళ్లు ఏర్పడతాయి. శరీరంతో తేమశాతం తగ్గడంతో చర్మ రక్షణ శక్తి తగ్గి దురదలు వస్తాయంటున్నారు. చేతులపై పగుళ్ల మాదిరిగా తెల్లటి గీతలు వస్తాయంటున్నారు. ఈ తరహా సమస్యలు మధుమేహ రోగులకు వస్తే ఇబ్బందులు ఉంటాయన్నారు. వాతావరణంలో మార్పులతో దగ్గు, ఆయాసం, గాలి పీల్చుకోవడం వంటి సమస్యలతో బాధపడేవారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది.



వెంగళరాయసాగర్ వద్ద కొండల నడుమ కురుస్తున్న మంచు

వేడినీరు తాగాలి...

శ్వాశ్వత, చెవి, ముక్కు, గొంతు సమస్యలు ఉన్నవారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీరు వేడి చేసి వడబోసుకొని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. చల్లటి పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు తీసుకోవద్దు. గొంతునొప్పి ఉన్నవారు ప్రతిరోజూ రెండుసార్లు వేడిచేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి పుక్కిలించాలని వైద్యులు చెబుతున్నారు.

సాలూరు ఏజెన్సీలో మంచు దుప్పటి

సాలూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏజెన్సీలో మంచు దుప్పటితో ప్రకృతి కొత్త అందాలు సంతరించుకుంటోంది. ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తూనే ఉంటోంది. మరోవైపు చలి పెరిగింది. పచ్చని పొలాల్లో మంచుతెరలు చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

గుండె జబ్బు బాధితులు అప్రమత్తం

గుండెజబ్బులు ఉన్నవారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. బ్లాక్స్ కొలెస్ట్రాల్ ఉన్న వారిలో రక్తనాళాల్లో పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. దీని వల్ల గుండె వైఫల్యం చెందే ముప్పు ఉంటుంది. చలి ఎక్కువగా ఉంటే వాకింగ్ చేయవద్దు. అధిక బరువు, ఆస్తమా, గుండె జబ్బులు ఉన్న వారు వాకింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చలికాలంలో పొగ, మద్యపానానికి తాగొద్దు. మధుమేహ రోగులు చల్లటి ప్రదేశంలో పడుకోవద్దు. పొగమంచు బారిన పడకుండా మాస్క్‌లు ధరించాలి. గోరు వెచ్చటి నీటితో స్నానం చేయాలి. చలిగాలి ఉన్న సమయంలో వృద్ధులు బయట తిరగొద్దని వైద్యులు చెబుతున్నారు.

శంకరరావు మాస్టారు

- వినూత్న బోధన ఆయన సొంతం
- పాఠాల పాటలతో పులకిస్తున్న విద్యార్థులు



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో శంకరరావు మాస్టారు(ఫైల్)

మెంటాడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): 'దేశ భవిష్యత్తు నిర్మాణానికి తరగతి గదే పునాది' అన్న మాటలను నిజమని నిరూపిస్తున్నారా ఉపాధ్యాయుడు. బెత్తం పట్టుకొని బెదిరించడం ద్వారా కాదు...ఇష్టంగా పిల్లలు చదువుకునేలా తీర్చిదిద్దుతున్నారు. ఆయనే బొంతలకోటి శంకరరావు. 1998లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఈ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు తరగతి గదిలో సంగీతం మాస్టారుగా మారిపోతారు. పాఠంలో సంక్షిప్తంగా ఉండే కొన్ని అంశాలకు కళారూపాన్ని అద్ది విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకునేలా చేయడం ఈ మాస్టారి ప్రత్యేకత. కోలాటం, తప్పెటగుళ్లు, జముకుల కథ, ఏకపాత్రాభినయం..ఇలా విభిన్న రూపాల్లో బోధిస్తారు. తన పాఠాలకు కీబోర్డు, గిటార్, కంజీర వంటి సంగీత వాయిద్య పరికరాలను జోడిస్తారు బొంతలకోటి.

రచయితగానూ గుర్తింపు

వృత్తిపరంగా ఉపాధ్యాయుడైన బొంతలకోటి మాస్టారు ప్రవృత్తి పరంగా మంచి రచయిత కూడా. పాటలతో పాఠాలు, సాంఘికంలో సరిగమలు, మనోపథం, చైతన్య గీతాలు, అక్షరమే ఆయుధం, జనజాగృతి కళారూపాలు, సాక్షర భారత్ కళారూపాలు, బడి నుంచి పొలంబడికి, కషాయాలు-ద్రావణాలు, ప్రకృతి మిత్ర, ప్రకృతిలో స్వచ్ఛ భారత్, నీరు-చెట్టు, బాలరక్ష, జీవ వైవిధ్యం-పర్యావరణం తదితర రచనలు ఆయన కలం నుంచి వెలువడ్డాయి. సైకాలజీ, సోషియాలజీ, హిస్టరీలో పీజీ పూర్తి చేసిన ఆయన మరికొన్ని డిప్లొమా సర్టిఫికెట్లనూ అందుకున్నారు. ఉపాధ్యాయుడిగా సుమారు పాతికేళ్ల ప్రస్థానంలో ఎందరో శిష్యులను సొంతం చేసుకున్న శంకరావు మాస్టారు ప్రస్తుతం మెంటాడ మండలం గుర్ల తమ్మిరాజుపేట (జీటీపేట)లో సేవలు అందిస్తున్నారు. గజపతినగరం మండలం పురిటిపెంట న్యూకాలనీకి చెందిన ఈ మాస్టారు మరెన్నో పురస్కారాలు అందుకోవాలని కోరుకుందాం.



వాయిద్యాలతో పిల్లలకు పాఠాలు బోధిస్తున్న శంకరరావు

ఎన్నో అవార్డులు

వినూత్న బోధనతో ఆకట్టుకునే శంకరరావు మాస్టారుకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రైవేటు, ప్రభుత్వ అవార్డులతో పాటు రాష్ట్రపతి పురస్కారం కూడా వరించాయి. వాటిలో కొన్ని..

2010లో కామన్‌వెల్త్ అంతర్జాతీయ అవార్డు.
2010లో బాల సాహిత్య పురస్కారం,
2011లో రాష్ట్రపతి అవార్డు.
2011లో లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం.
2012లో నేషనల్ గ్రీన్ టీచర్ అవార్డు.
2012లో ఐక్యరాజ్య సమితి జీవన వైవిధ్య అంతర్జాతీయ అవార్డు.
2012లో లీడ్ ఇండియా పురస్కారం.
2013లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు.
2014లో సాక్షర భారత్ జాతీయ పురస్కారం.
2016లో ఉత్తమ రచయిత అవార్డు.
2017లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు.
2019లో బెంగళూరు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ పురస్కారం.... ఇలా అనేక అవార్డులు శంకరరావు మాస్టారును వరించాయి. ఇక జిల్లా స్థాయిలో అందుకున్న పురస్కారాలకు లెక్కే లేదు.

బతుకు పాఠం నేర్పారు

నాది బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామం. 7 నుంచి పది వరకు శంకరరావు మాస్టారు దగ్గర చదువుకోవడం నా పూర్వజన్మ సుకృతం. ఆయన క్లాస్ అంటే నేనే కాదు... పిల్లలందరం ఎగిరి గంతులేసేవాళ్లం. పాటల రూపంలో ఆయన బోధన నాకు జీవిత పాఠం నేర్పింది. చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతకు అప్పుడే నాలో బీజం పడింది.

- హరీష్, ఎస్ఐ, భీమునిపట్నం

గురుబ్రహ్మ అనే పదానికే గౌరవం

నాది దత్తిరాజేరు మండలం దాసుపేట గ్రామం. శంకరరావు మాస్టారు గురుబ్రహ్మ పదానికి గౌరవం తెచ్చిన వ్యక్తి. ఆటపాటలతో విద్యను బోధిస్తూనే, ఉన్నత విలువలు, వ్యక్తిత్వం, సామాజిక బాధ్యతను కూడా నేర్పారు. రోడ్డు సౌకర్యం లేక సైకిలుపై రావడానికి మాస్టారు ఇబ్బంది పడేవారు. మేము సైకిల్‌పై తీసుకొచ్చే వాళ్లం. ఆయన పాఠాలు విని మహిళలు గ్రామంలో మద్యపాన నిషేధం చేయించారు.

- గణపతి, బీట్ ఆఫీసర్, అటవీ శాఖ



స్వామివారి దర్శనానికి క్యూలో బారులుదీరిన భక్తులు

తోటపల్లికి పోటెత్తిన భక్తులు

- మార్మోగిన గోవింద నామస్మరణ

గరుగుబిల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా పేరొందిన తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామసావమి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక నాలుగో శనివారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి భారీగా భక్తజనం తరలివచ్చారు. తొలుత నాగావళి నదిలో స్నానాలు ఆచరించారు. ఆలయంలోని క్యూలైన్లలో గంటల కొద్దీ నిరీక్షించిన అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఆలయ ప్రాంగణంలో పార్వతీపురం మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన సంతోషిమాత కోలాటం గ్రూపు సభ్యుల కోలాటం ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



అలంకరణలో ఉత్సవమూర్తులు

బొబ్బిలిలో కబ్జాలే కబ్జాలు

- విచారణలో అధికారులు బిజీబిజీ
- ఎక్కడికక్కడే అక్రమాలు

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రాంతంలో భూ కబ్జాల పర్వంపై చాలా ఏళ్ల నుంచి అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఒక్క బొబ్బిలి మండలంలోనే సుమారు 200 ఎకరాలకు పైగా భూములను కబ్జాదారులు హస్తగతం చేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు మారుతున్న ప్రతిసారీ ఈ భూ భాగోతాలు తెరమీదకు వస్తున్నాయి. గ్రీవెన్స్‌లోనో... ఇతరత్రా గానీ ఫిర్యాదులు అందగానే రెవెన్యూ అధికారులు ఆ భూముల పరిశీలనకు పరుగులు తీస్తున్నారు. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది మామూళ్లకు ఆశపడి భూముల రికార్డులను తారుమారు చేశారని, హక్కులను బదలాయించారన్నవి ప్రధానమైన ఆరోపణలు. వీటిలో కొన్ని కోర్టు కేసులు కూడా ఉన్నాయి. కేసులలో ఉన్న భూముల జోలికి అధికారులు పోవడం లేదు. గిరిజనుల భూములు, అటవీ భూములు సైతం కబ్జాల కోరల్లో చిక్కుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కదిలిన రెవెన్యూ యంత్రాంగం

బొబ్బిలి పరిసరాలలో ఆక్రమణలపై రెవెన్యూ యంత్రాంగం కదిలింది. తహసీల్దారు మలపురెడ్డి శ్రీను భూ కబ్జాల ఆరోపణలపై విచారణ చేపడుతున్నారు. ఇందిరమ్మ కాలనీలో సుమారు 400 ఖాళీ స్థలాల్లో సగానికి పైగా కొంతమంది ఆక్రమించుకొని వ్యాపారాలు సాగిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వాటిపై విచారణ కొనసాగుతోంది. గతంలో అనేకసార్లు దర్యాప్తు పర్వాలు సాగాయి. ఎప్పటికప్పుడు ఈ తతంగం మొదటికి వస్తోంది. గతంలో పనిచేసిన అధికారులు ఇష్టారాజ్యంగా పట్టాలు జారీ చేయడంతో ఈ సమస్య తీవ్ర తరమైంది. కొన్నిటిని అధికారికంగా... మరికొన్నిటికి ఎటువంటి ఆధారాలు లేకుండా పట్టాలను జారీ చేసేశారు. దీనిపై రెవెన్యూ, మున్సిపల్, పంచాయితీరాజ్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా విచారణ చేపట్టి.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే యోచనలో రెవెన్యూ అధికారులు ఉన్నారు.

- మిలటరీ కాలనీలో ఇదే పద్ధతిలో పట్టాలు జారీ చేసినట్లు ఆరోపణలు రావడంతో వాటిపై విచారణ చేపడుతున్నారు. ఆక్రమణలను తొలగిస్తున్నారు.
- నిమ్మలపాడు గిరిజన ప్రాంతంలో స్థానికేతరులు భూకబ్జాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో వాటిపై తహసీల్దారు బృందం శనివారం విచారణ చేపట్టారు. సుమారు 13 ఎకరాలు కబ్జాకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అందు లో 3.23 ఎకరాలకు రైతులు పత్రాలు చూపిస్తున్నారు. మిగిలిన వాటికి ఆధారాలు చూపించేందుకు గడువు ఇచ్చారు. కొయకొం డవలస-చెల్లియ్యవలసలోని పదెకరాల గిరిజన భూములపై తాజాగా ఆరోపణలు రావడంతో విచారణ జరుగుతోంది. సం బంధిత వ్యక్తులు ఆధారాలను చూపించుకోవాలని తహసీ ల్దారు వారికి గడువు ఇచ్చారు.
- మల్లమ్మపేట అటవీ పరిధిలో 450 హెక్టార్లలో భూములు ఉన్నాయి. వాటిలో సగం భూములను కొంతమంది సాగు చేసుకోవడం, ఇంకొంతమంది వేరే అవసరాలకు వినియోగించడం జరుగుతోంది. దీనిపై చాలా ఏళ్ల నుంచి వివాదం నలుగుతోంది. అటవీ-రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం కొరవడడంతో ఈ వివాదం తెగడం లేదు.



విచారణ చేస్తున్న తహసీల్దారు శ్రీను, రెవెన్యూ సిబ్బంది

- పారాది-కాశిందొరవలస గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీల మధ్య 125 ఎకరాల భూములకు సంబంధించిన వివాదం రెండు దశాబ్దాల నుంచి నడుస్తోంది. భూములకు నిజమైన హక్కుదారులు ఎవరనేది తేలకపోవడంతో వివాదం సద్దుమణగడం లేదు. ఇది కూడా కోర్టు కేసుల్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.
- గొల్లపల్లి, మల్లమ్మపేట ప్రాంతాలలో ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో దర్యాప్తు నిర్వహిస్తున్నారు.
- గొర్లెసీతారాంపురం రెవెన్యూ పరిధిలో పేరుగాంచిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెండు గోర్జీలను ఆక్రమించినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై సంబంధిత యజమానికి నోటీసులు జారీ చేశారు. మరికొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇదే తరహాలో కబ్జాల కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

భూ వివాదాలపై విచారణ

బొబ్బిలి మండలంలో పదికిపైగా భూ వివాదాలపై స్వయంగా క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాను. మిలటరీ కాలనీతో పాటు మరికొన్ని ప్రాంతాలలో ఆక్రమణలను తొలగించి బోర్డులను ఏర్పాటు చేశాం. ఇందిరమ్మ కాలనీలో దొంగపట్టాలు ఉన్నట్లు వస్తున్న ఆరోపణలపై రెవెన్యూ, మున్సిపల్, పంచాయితీ రాజ్ సిబ్బందితో సంయుక్తంగా దర్యాప్తు నిర్వహించి నిగ్గుతేల్చుతాం. భూ యజమానులుగా చెప్పుకునే వారు తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను చూపించాలి. లేదంటే వాటిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- ఎం.శ్రీను, తహసీల్దారు, బొబ్బిలి

8న చలో విశాఖ

గరివిడి,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర మాలల గర్జన డిసెంబర్ 8న విశాఖలో నిర్వహించనున్నట్లు దళిత నేతలు తెలిపారు. ఈమేరకు గరివిడి చలో విశాఖకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత నేతలు టొంపల సంజీవి, చంద్రరావు, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

29న శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం,నవంబరు 23(ఆంధ్రజ్యోతి):రాజాంలోని నైరెడ్‌లో ఉపాధి శిక్షణకు ఈనెల 29న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పీవో నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 19నుంచి 40 ఏళ్లుగల పురుషులకు ఏసీఫ్రిజ్‌మెకానిక్ వర్క్స్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లే పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 9866913371, 9491741129, 9014716255 నెంబర్లుకు సంప్రదించాలని కోరారు.

కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులు లేనివారు దరఖాస్తులు చేసుకోవడానికి ప్రభుత్వం డిసెంబరు రెండో తేదీ నుంచి 28 వరకు దరఖాస్తుల ఆహ్వానిస్తోందని సీఎస్ డీటీ ఎస్.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు ఈఏడాది జనవరి ఒకటి నుంచి మార్చి 24 వరకు చేసిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.మండలంలో తొమ్మిది కస్టర్లల్లో ధాన్యం కొనుగోలుప్రారంభించినట్లు తెలిపారు.

●జామి,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకునేందుకు డిసెంబరు 2నుంచి ప్రభుత్వం ఆప్షన్ ఇచ్చిందని సీఎస్‌డీటీ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. మండలంలోని ధాన్యం కొనుగోలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.

కొల్లాం రైలుకు కొత్తవలసలో హాల్ట్

కొత్తవలస, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాముల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం రోడ్డు నుంచి కొల్లాంకు నడుపుతున్న ప్రత్యేక రైలుకు కొత్తవలసలో హాల్ట్ కల్పించినట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. 08553-54 నంబరుగల రైలు ప్రతి ఆదివారం ఉదయం ఆరు గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలు దేరి కొత్తవలస మీదుగా వెళ్తుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైలు డిసెంబరు ఒకటి నుంచి 26 వరకు నడుస్తుందని తెలిపారు.

సీఎంను కలిసిన శ్రీనివాసరావు

వంగర,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొప్పల వెలమ కార్పొరేషన్ సభ్యుడు బల్లిరెడ్డి శ్రీనివాసరావు అమరావతిలో సీఎం చంద్రబాబును శుక్రవారం కలిశారు.ఈమేరకుశనివారం అమరావతి నుంచి కింజంగి రావడంతో గ్రామస్థులు, నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మడ్డువలసలో పోలీసుల నిఘా

వంగర, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్ పరిసరాల్లో శనివారం ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. ఇటీవల రిజర్వాయర్‌కు సమీపములో ఉన్న ఓ జూనియర్ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఇక్కడ మద్యం సేవించి కొట్లాటకు దిగడంతో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ షేక్ శంకర్ సిబ్బందితో నిఘా ఏర్పాటుచేశారు.

ఆశా కార్యకర్తలకు శిక్షణ

రేగిడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ వైద్యంతో సర్వరోగాలు నివారణ అవుతాయని సంకిలి ఆయుర్వేద డిస్పెన్సరీ వైద్యధికారి డి.మోహనరావు, రేగిడి పీహెచ్‌సీ వైద్యధికారి అశిరినాయుడులు తెలిపారు. రేగిడి పీహెచ్‌సీ పరిదిలో ఆశాకార్యకర్తలకు ఆయుష్ వైద్యంపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సుందరేశ్వరరావు, సిబ్బంది కృపాలనీ, అప్పారావు, జగదీష్ పాల్గొన్నారు.

ఎస్.కోటలో వ్యవసాయ అధికారులకు..

శృంగవరపుకోట నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ఎస్.కోటలో శనివారం నియోజకవర్గంలోని ఐదుమండలాల సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లకు శిక్షణనిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహయ సంచాలకులు ఎల్.విజయ, డీఆర్‌సీ ఏడీఏ కె.భారతి పాల్గొన్నారు.

పల్లవికి విద్యార్థుల నివాళి

గంట్యాడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవాలు దానం చేసి చేసి మరో నలుగురికి ప్రాణాదానంచేసిన పల్లవికి ప్రగతి పాఠశాల విద్యార్థులు నివాళులర్పించారు. శనివారం పాఠశాల ఆవరణలో పల్లవిచిత్ర పటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

జేఎన్‌టీయూలో వీసీ పర్యటన

విజయనగరంరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, సెంచూరియన్ యూనివర్శిటీల వీసీలు, అధ్యాపకులు రిసెర్చ్ కార్యక్రమంలో భాగంగా శనివారం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆంధ్రాయూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఎం.శశి, సెంచూరియన్ వర్సిటీ వీసీ జీఎస్ఎన్‌రాజు, జేఎన్‌టీయూ గురజాడ విశ్వ విద్యాలయం వీసీ ఆచార్య డి.రాజ్యలక్ష్మిలు సమావేశం నిర్వహించారు. గురజాడ విశ్వ విద్యాలయంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు.


లక్ష్యంతో బోధించాలి: ఆర్జేడీ

గజపతినగరం, నవంబరు 23: (ఆంధ్రజ్యోతి): విద్యావిధానంలో విన్నూతన మార్పులు తీసుకురావాలని ఆర్జేడీ కె.విజయభాస్కర్ కోరారు.శనివారం గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాల ల్లో పిల్లల స్థాయిని ఏ విధంగా పెంపొందించాలన్న లక్ష్యంతో బోధించాలని కోరారు. తొలుత మరుపల్లిలోని మెడల్ స్కూల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో మాణిక్యంనాయుడు, ఎంఈవో-1 విమలమ్మ, ఎంఈఓ-2 బి. సాయిచక్రధర్ పాల్గొన్నారు.

అవగాహన లేక.. వినియోగానికి నోచుకోక

● సామగ్రి నిల్వకు వాడుకుంటున్న వైనం

● నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు



బంగారమ్మపేటలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

గజపతినగరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో శతశాతం ఆరుబయట బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలన్న లక్ష్యం అటకెక్కుతోంది. ప్రధానంగా మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన లేకపోవడంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో కొందరు సామగ్రి నిల్వచేసుకోవడానికి వినియోగిస్తున్నారు. 30పంచాయతీల్లో 60 వేలకుపైగా జనాభా నివసిస్తోంది.గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఉంచేందుకు ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నాయి. గతంలో టీడీపీహయాంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఏర్పాటుచేసుకోవాలని భావించి రూ.15 వేలతో మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రయోగాత్మకంగా చేపట్టింది.మరుగుదొడ్డి లేనివారికి పింఛన్, రేషన్‌కార్డు నిలిపివేస్తామని హెచ్చరించడంతో ప్రతిఒక్కర్లూమరుగుదొడ్లను నిర్మాణాలు చేపట్టారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో మరుగుదొడ్ల వినియోగం అటకెక్కింది. కాగాప్రతిఒక్కరూ మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో బి.కళ్యాణి కోరారు. ప్రస్తుతం ఇంటింటిసర్వే చేపడుతున్నామని, లేని వారినిగుర్తించి సొంతస్థలం ఉంటే మరుగుదొడ్డి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



భూదేవిపేటలో సామగ్రి నిల్వకు మరుగుదొడ్లు వినియోగిస్తున్న దృశ్యం

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

● డిప్యూటీ కలెక్టర్ నూకరాజు

భోగాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదుపై యువతకు అవగాహన కల్పించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, డిప్యూటీ కలెక్టర్ నూకరాజు సూచించారు. శనివారం భోగాపురంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్, ఆర్ఐ ఇమ్రాన్ పాల్గొన్నారు.

● వంగర నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించను న్నట్లు తహసీల్దార్ గోవిందరావు తెలిపారు. శనివారం వంగర, సీతారాం పురంతోపాటు పలుగ్రామాల్లోని ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు.

●విజయనగరం రూరల్, నవంబరు 23: (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వుడా కాలనీలో గల 224, 228, 232 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆర్డీవో దాట్ల కీర్తి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల డీటీ బి.సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

● నెల్లిమర్ల, నవంబరు 23: (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల, జరజాపుపేట, మొయిద విజయరాంపురంల్లో తహసీల్దార్ సుదర్శనరావు ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమం ఎన్నికల విభాగం డీటీ వీవీఆర్ జగన్నాథరావు, హెచ్‌డీటీ రవిశంకర్ పాల్గొన్నారు.



భోగాపురం: ఓటరునమోదుకు వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తున్న నూకరాజు

మూడు కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని మూడు కిలోల స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ నరేష్, సిబ్బంది రైల్వే స్టేషన్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరువూరు జిల్లా జగన్నాథమూర్తి నగర్ నేతాజీ స్ట్రీట్‌కి చెందిన ఎస్.శ్రీను అనుమానాస్పదంగా తిరుగుతుండగా తనిఖీలు నిర్వహించి స్టేషన్‌కు తరలించి విచారించినట్లు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఈకేసుల క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐ అప్పలనాయుడు, ఎస్ఐనరేష్, పీసీలు సూర్యనారాయణ, ఆనందబాబును అభినందించారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

విజయనగరం క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలంలోని ముసిరం గ్రామపరిధిలో సారాతయారీ కేంద్రంపై శనివారం దాడి చేసి 600 లీటర్ల బెల్లంఊటను ధ్వంసంచేశారు.అనంతరం ఆ గ్రామంలో సారా వల్ల కలిగే అనర్థాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, మనోజ్ పాల్గొన్నారు.

తండ్రిపై కుమారుడు పోలీసులకు ఫిర్యాదు

చీపురుపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలవలసలో తనను తండ్రి ఇంటి నుంచి గెంటేశాడని ఓ కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుల కథనం ప్రకారం.. నిమ్మలవలసలోని ఎస్సీ కాలనీకి చెందిన బాలకృష్ణ ఆయన భార్య కూలి పనులు చేస్తూ, తన తండ్రి మహేష్‌తో కలిసి ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. తండ్రి మహేష్ ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నాడు. ఈవిషయంపై ప్రశ్నిస్తే బాలకృష్ణను ఆయన భార్యను దూషిస్తున్నాడు. ఈనేపథ్యంలో ఈనెల 11న తండ్రి మహేష్ వీరితో గొడవపడ్డాడు. ఆయన పెట్టిన హింసను భరించలేక అదేరోజున రాత్రిఒంటి గంటసమయంలో బాలకృష్ణ,మంజులు పోలీస్‌స్టేషన్‌లో మహేష్‌పై ఫిర్యాదుచేశారు.దీంతో మహేష్ ఆ రాత్రే బాలకృష్ణ కుటుంబాన్ని బయటికి గెంటేసి, ఇంట్లో సామగ్రి రోడ్డుపైకి విసిరేశాడు. ఈ సందర్భంగా బాలకృష్ణ, మంజులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 11న ఫిర్యాదుచేసినా పోలీసులు శుక్రవారం వరకూ సంఘటనపై దర్యాప్తు చేయలేదని ఆరోపించారు.కాగా ఈనెల 11న మంజు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కోడిగుడ్ల మహేష్, రాజ్‌కుమార్,శ్యామ్‌పై కేసు నమోదుచేశామని ఎస్ఐ ఎల్.దామోదరావు తెలిపారు. గ్రామంలోకి వివరాలు నమోదుచేయడంకోసం తమ సిబ్బంది శుక్రవారం వెళ్లారని, బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు చేశారని చెప్పారు.రాజీ కుదుర్చుకొని, బాధితులకు ఇబ్బందిలేకుండా సమస్యను పరిష్కరిస్తామని కొంతమంది పెద్దలు చెప్పారని, న్యాయం జరగని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొరియర్స్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

విజయనగరం క్రైం,నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ఇంటర్నేషనల్ కొరియర్స్ పేరుతో సైబర్ మోసగాళ్లు చేసే ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. ఇంటర్నేషనల్ కొరియర్స్ స్కాంపై వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరుతూ జిల్లా పోలీసుశాఖ రూపొందించిన పోస్టర్లు, వీడియోను ఎస్పీవిజయనగరంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి నేరాల్లో నగదును పోగొట్టుకున్నట్టయితే, 1930 లేదా నేషనల్ సైబర్ క్రైం పోర్టల్‌లో రిపోర్టు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వీడియోగ్రాఫర్ జగదీష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, వీడియోగ్రాఫర్ జగదీష్‌లు పాల్గొన్నారు.

ఆవు పాల ధరను పెంచాలి

కొత్తవలస, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) :ఆవుపాల ధరను పెంచాలని కొత్తవలస-అరకు రోడ్డులోని నిమ్మలపాలెం జంక్షన్ దగ్గర శనివారం ఆవుపాల ఉత్పత్తిదారులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవుపాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు గొంపకృష్ణ మూర్తి, గాడి అప్పారావు మాట్లాడుతూ ఆవుపాల ధరను లీటరుకు రూ. 3 నుంచి రూ.4 వరకు యాజమాన్యం తగ్గించడంతో రైతులు రోజుకు రూ.20 లక్షల వరకు నష్టపోతున్నారని తెలిపారు.కార్యక్రమంలో రైతులు బొబ్బర రాజు, చీపురుపల్లి లక్ష్మి,గోకాడ సత్యారావు,పోతునాయుడు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

సయ్యద్ ముస్తక్ ఆలీ టీ- 20 టోర్నీ ప్రారంభం

● తొలి మ్యాచ్‌లో రైల్వేస్‌పై అస్సాం విజయం

విజయనగరం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ క్రికెట్ మైదానంలో శనివారం బీసీసీఐ ఆధ్వర్యంలో సయ్యద్ ముస్తక్ ఆలీ టీ- 20 దేశవాళీ క్రికెట్ టోర్నీ ప్రారంభమయ్యింది. తొలిరోజు అస్సాం, రైల్వేస్ జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్‌లో అస్సాం జట్టు మూడు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన రైల్వేస్ జట్టు 19.3 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అస్సాం బౌలర్ ముక్తర్‌హుస్సేన్ నాలుగు ఓవర్లలో 18 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 128 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన అస్సాం జట్టు 18.4 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. అస్సాం ఓపెనర్లు పుర్కయస్త (16), రుహినందన్ పెగు (35) పరుగులతో రాణించారు. కాగా ఈ విజయంతో అస్సాం ఖాతాలో నాలుగు పాయింట్లు చేరాయి.

సంకిలి కర్మాగారానికి చెరకు తరలిస్తాం: ఎండీ

జామి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ ఏడాది భీమసింగి సుగర్స్‌కు చెరకు అందించే రైతులకు టన్నుకు రూ.2,800 మద్దతు ధర చెల్లిస్తున్నామని, 25 టన్నులు పైబడి అందిస్తే టన్నుకు రూ2,933 చెల్లిస్తామని భీమసింగి సుగర్స్ ఎండీ వి.సన్యాసినాయుడు తెలిపారు. శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కర్మాగారానికి చెరకు అందిస్తే ఇక్కడ నుంచి సంకిలి ప్యారీ చెరకు కర్మాగారానికి తరలిస్తామని చెప్పారు. ప్యారీ కర్మాగారం ప్రతినిధులు ఈప్రాంతంలో చెరకు పంట ప్రోత్సాహించేందుకు పలు రాయితీలు ప్రకటించారని తెలిపారు.

సబ్ జైలులో రికార్డుల పరిశీలన

శృంగవరపుకోట నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) శృంగవరపుకోట సబ్ జైలును శనివారం జిల్లా అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి టీవీ రాజేష్ కుమార్ సందర్శించారు. స్థానిక న్యాయాధికారి సబ్బవరపు వాణితో కలసి జైలు పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. స్థానిక పుణ్యగిరి ఆలయాన్ని రాజేష్ కుమార్ దర్శించుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం: అదితి

విజయనగరం రూరల్, నవంబరు 23: (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. శనివారం విజయనగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం అదితి గజపతిరాజు జన్మదినం పురస్కరించుకుని నియోజకవర్గ పార్టీనాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు సునీలాగజపతిరాజు, కనకమహాలక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా 400 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కాగా పినవేమలిలో గల ఏబీసీడీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్నభోజనంతో పాటు, పండ్లు, రొట్టెలను అదితి గజపతిరాజు పంపిణీ చేశారు.

ప్రజారోగ్యంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

విజయనగరం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం పెంపొందించడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని మాన్సాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కేవీఎల్ రాజు తెలిపారు. జాతీయ ఫార్మసి - 2024 వారోత్సవాల్లో భాగంగా నగరంలోని కోట జంక్షన్ నుంచి ఫార్మసీ కళాశాల వరకు థింక్ హెల్త్, థింక్ ఫార్మసీ నినాదంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామయ్య పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

గంట్యాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి పీవీ రమణ కోరారు. తాటిపూడి ఆవలఉన్న డీకేపర్తి గ్రామాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

అదానీని అరెస్టు చేయాలి

● యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు

విజయనగరం రింగురోడ్డు,నవంబరు 23(ఆంధ్రజ్యోతి):సౌర విద్యుత్‌ఒప్పందాల్లో అవినీతికి పాల్పడి అమెరికా కోర్టులో ఆరోపణ ఎదుర్కొంటున్న పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీని అరెస్టు చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు డిమాండ్‌చేశారు. శనివారం తోటపాలెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అదానీని అరెస్టు చేయాలని గోడపత్రికలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో జాతీయ యూత్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.విద్యాసాగర్, నాయకులు ఎస్.శ్రీనివాస్, మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

● విజయనగరం దాసన్నపేట, నవంబరు 23: (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలులో 2029వేల కోట్ల ఆయా రాష్ట్రాధికారులు లంచాలు ముట్టజెప్పినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీనిఅరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. విజయనగరంలో అదానీని అరెస్టు చేయాలని నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో రమణమ్మ, హరీష్, శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు.

●దత్తిరాజేరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఒప్పందాల్లో అవినీతికి పాల్పడినట్లు అమెరికాలో కేసుల నమోదుకావడంతో అదానిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి కోరారు.మానాపురం రహదారి వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎల్.దాలినాయుడు, ఈశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.25 లక్షల విరాళం

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 23:(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కోసం ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం అమరావతిలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి రూ.25 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి, ప్రతినిధులు నాగరాజు, రఘువరన్, పూర్ణచంద్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1,200 కిలోల ప్లాస్టిక్ సామగ్రి స్వాధీనం

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 23:(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పలు ప్రాంతాల్లో దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో స్వాధీనం చేసుకున్నారు. శనివారం ప్రజారోగ్యఅధికారి కొండపల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో పారిశుధ్య పర్యవేక్షకులు హోల్‌సేల్ దుకాణాలపై దాడులు జరిపి 1,200 కిలోల నిషేదిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక కోసం పొలాల ధ్వంసం

● ఆందోళన వ్యక్తం చేస్తున్న మామిడిపల్లి రైతులు

శృంగవరపుకోట రూరల్ నవంబరు 23 : తమ పొలాల్లో ఇసుక కోసం కొందరు గోతులు చేయడంతోపాటు తమ జీవనాధారమైన వృక్షాలను కూలదొసి పొలాలు ధ్వంసం చేస్తున్నారని, అడ్డుకుంటే తమపైనే దౌర్జన్యం చేస్తున్నారని మామిడిపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిరాయితీ, డీపట్టా భూముల్లో వ్యవసాయం, పండ్లతోటలు వేసుకొని జీవిస్తున్నామని రైతులు కొట్యాడ రమణ, ఎర్నాయుడు, సత్యం, నాగమయ్య, చిట్టిబాబు,అప్పలనాయుడు, బంగారునాయుడు తదితరులు వాపోతున్నారు. 15 రోజుల కిందట ప్రభుత్వం ఎక్కడైన ఇసుక తవ్వుకోవచ్చని చెప్పడంతో గోస్తనీ తీరానికి ఆనుకొని పొలాలు, పండ్లతోటల్లో తాము లేని సమయంలో ఇసుక అక్రమంగా తవ్వేశారని చెబుతున్నారు. దీంతో పోలాలు గోతులుగా మారడంతో పాటు టేకు, జీడీ, నీలగిరి వృక్షాలు నేలకూలుతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈవిషయంపై సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామని రైతులు తెలిపారు.

నడిపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు

పూసపాటిరేగనవంబరు23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నడిపల్లి, వెల్దూరు,తిప్పలవలస, పతివాడ, ఎరుకొండల్లోమార్కెఫెడ్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు టీడీపీ సభ్యత్వ నమోదుకార్యక్రమాన్ని పరిశీలించారు.కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శంకరరావు, పాల్గొన్నారు.

●భోగాపురం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ కార్యక్రమం వేగవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ తెలిపారు రెడ్డికంచేరులో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రాంకృష్ణ, బైరెడ్డి చిట్టిబాబు, మౌళీవర్మ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

రాజాం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేయాలని జడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు కోరారు. ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తహసీల్దార్‌ఎస్.కృష్ణంరాజు, ఏవో ఎం.రేణుకాసాయిలు మాట్లాడుతూ నేరుగా రైతులు ఏ మిల్లుకు తీసుకువెళ్లినామిల్లర్లు కొనుగోలుచేస్తారని, కొనుగోలు చేసిన 28 గంటల్లోనే రైతుల ఖాతాలకు డబ్బులుజమచేస్తారని తెలిపారు.ఎమ్మెల్సీవిక్రాంత్ మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అధికారులు గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండల బడ్జెట్‌కు ఆమోదం

చీపురుపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి మండల 2024-25 సవరించిన బడ్జెట్‌తో బాటు 2025-26కు అంచనా బడ్జెట్‌కు మండల పరిషత్ ఆమోదించింది. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అధ్యక్షతన శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.సరళ, ఏఓ ప్రవీణ్, సిబ్బంది బి. సురేష్, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

● గంట్యాడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలోని 2024- 2025 సవరణ, 2025-2026 అంచనా బడ్జెట్ ఆమోదించారు. ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, ఈవోపీఆర్‌డీ భానోజీ రావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

నెల్లిమర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని,స్వనిధి- స్వాభిమానం కార్యక్రమాన్ని సద్వినియోగంచేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు సూచించారు. శనివారం నెల్లిమర్లలో మెప్మా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీఎంఎం డి.గోవిందరావు, సీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రినాధమ్మ, వీఆర్వో వెంకటలక్ష్మి, ఓ.దివ్యవాణి, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు

బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు

మెంటాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని గజపతనగరం ఎక్సైజ్ సీఐ జనార్దనారావు తెలిపారు. వాణిజ, ఆంధ్ర, గుర్ల గ్రామాల్లో సారా, మడ్డికల్లు, గంజాయి తాగడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్ర, భాషా,లోకిబి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రదర్శన

నెల్లిమర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాను తహసీల్దార్ బి.సుదర్శనరావు శనివారం కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శించారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే డిసెంబరు 9 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వచ్చే నెల 30న తుది ఓటర్ల జాబితా

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల ● తొమ్మిదో తేదీ వరకూ అభ్యంతరాలు

విశాఖపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితా శనివారం విడుదల చేశారు. ఆరు జిల్లాల పరిధిలో 15,287 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో 9,638 మంది పురుషులు, 5,647 మంది మహిళలు ఉన్నారు. ఓటు నమోదుకు 17,404 దరఖాస్తులు రాగా 2,117 తిరస్కరించి, 15,287 మందితో ముసాయిదా జాబితా రూపొందించారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 3,906 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. మహిళా ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు పరిశీలిస్తే విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 1,421 మంది ఉండగా, అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 527 మంది ఉన్నారు. కాగా ముసాయిదా ఓటర్ల జాబితాపై శనివారం నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, విశాఖపట్నం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో అయితే 'సీఈవో ఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్'కు లేదా ఆఫ్‌లైన్‌లో అయితే సంబంధిత ఓటరు నమోదు అధికారి, సహాయ నమోదు అధికారికి నిర్ణీత దరఖాస్తు ఫారంలో అందజేయాలని సూచించారు. ఇంకా కొత్తగా ఓటరుగా నమోదుకు లేదా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని ఉపాధ్యాయులు వచ్చే నెల తొమ్మిదో తేదీలోగా తమ దరఖాస్తులు అందజేయవచ్చునన్నారు. ఈనెల ఒకటో తేదీ నాటికి ఆరేళ్ల ముందు మాధ్యమిక పాఠశాలకు తక్కువకాని విద్యా సంస్థలో కనీసం మూడేళ్లపాటు బోధనానుభవం ఉండాలని, అందుకు సంబంధించిన ధ్రువీకరణపత్రం, ఇతర డాక్యుమెంట్లు అంటే నివాస ధ్రువపత్రం, పాస్‌పోర్టు ఫొటో జతచేసి ఫారం-19 సమర్పించాలన్నారు. కాగా అభ్యంతరాలు పరిష్కరించి వచ్చే నెల 30న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
శ్రీకాకుళం	2,725	1,181	3,906
విజయనగరం	2,164	1,261	3,425
పార్వతీపురం మన్యం	1,267	595	1,862
విశాఖపట్నం	1,426	1,421	2,847
అనకాపల్లి	1,225	664	1,889
అల్లూరి	831	527	1,358
మొత్తం	9,638	5,647	15,287

శిలాఫలకాలతోనే సరి..

(ఐదో పేజీ తరువాయి)

అవుతుంది. శివారు ప్రాంతాలకు ట్యాంకర్లే గతి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమేరకు సమస్యను పరిష్కరించినా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పనులన్నీ నిలిచిపోయాయి. పార్వతీపురం, సాలూరు, పాలకొండలోనూ ఇదే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి రానున్న వేసవిలోగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తాం..

పార్వతీపురం, సాలూరు, పాలకొండలో తాగునీటి సమస్య పరిష్కారానికి అప్పట్లో రూ.180 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి రివైజ్డ్ అంచనాలు తయారు చేస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తాం.

- పి.వంశీకృష్ణ, జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారి, పార్వతీపురం మన్యం

పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

పార్వతీపురంటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి లోని ఉద్యానవనాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు తెలిపారు. పట్టణంలోని పోలీసు శాఖ వారి పిల్లల పార్కు పునరుద్ధరణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపాల్టీ ఆధ్వర్యంలో ఉన్న బెలగాంలో గల డాక్టర్ సన్యాసిరాజు మున్సిపల్ ఉద్యానవనం, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీలో గల మున్సిపల్ పార్కు, కొత్తవలస నవదుర్గ ఆలయం వద్ద గల చెరువు చుట్టు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అలాగే మున్సిపాల్టీలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు పొందిన సౌందర్య నారాయణ మూర్తి నగర్‌లో గల పార్కు అభివృద్ధికి ఇప్పటికే రూ.10లక్షలు కేటాయించామని చెప్పారు. తమ పరిధిలో ఉన్న పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలోనే ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

బెలగాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమే 108 వాహన వ్యవస్థను నిర్వహించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం స్థానిక గిరిజన భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ 108 సర్వీసులను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడంతో సేవల్లో నాణ్యతా ప్రమాణాలు కొరవడుతున్నాయని అన్నారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జి.రవికుమార్, ఎన్జీవో జిల్లా అధ్యక్షులు కిషోర్, జనసేన నాయకుడు శ్రీను, ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కిషోర్, సీఐటీయూ నాయకులు సుబ్బరావమ్మ, పాకల సన్యాసి, వంగల దాలినాయుడు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై ఆరా

సీతానగరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదభోగిలి రైతుసేవా కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శనివారం సందర్శించారు. ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన ధాన్యం నమూనాలను పరిశీలించారు. రైతుసేవా కేంద్రంలో ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కనీస మద్దతు ధర తెలిపేలా ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం నూర్పులు జరిగిన వెంటనే రైతుల నుంచి సేకరించాలని, తేమ 17 శాతం కంటే తక్కువ ఉండి నాణ్యత బాగుంటే వెంటనే వారికి గోనె సంచులు జారీ చేయాలని ఆదేశించారు. బయట మార్కెట్‌లో ధాన్యం అమ్మిన రైతులను ఈ-పంట నమోదు నుంచి తొలగించాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఉమా, మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్, పీపీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



జాబితాను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మక్కువ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట బైరిపురంలో 227, 228 నెంబర్ పోలింగ్ కేంద్రాలను పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శనివారం పరిశీలించారు. క్లయిమ్‌లను సత్వరమే పరిష్కరించాలని బీఎల్వోలకు సూచించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటమే ధ్యేయం

సీతానగరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటమే పీడీఎఫ్ ధ్యేయమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. మండలంలోని జోగింపేట కేజీబీవీ, గురుకుల పాఠశాలలను ఆమె శనివారం సందర్శించి, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తనను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సీతానగరం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.మురళి, యూటీఎఫ్ నాయకులు పల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

పశుగ్రాసాల సాగుతో మేలు

మక్కువ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు పశుగ్రాసాల సాగుతో మేలు కలుగుతుందని పశు సంవర్థక శాఖ ఏడీ సన్యాసినాయుడు అన్నారు. తూరు మామిడి పశువైద్య కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు పశు పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆడ లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. సుమారు 82 పశువులకు గర్భం కోసం పరీక్ష చేసి చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి కృష్ణమూర్తి, పశు వైద్యాధికారులు కొట్టిశ పొలండొర, జగదీష్, సురేష్‌కుమార్, ప్రభాకరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ

కురుపాం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో అయ్యప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మూడో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ పాల్గొన్నారు. రూ.2లక్షల విరాళం అందజేశారు.



పూజల్లో పాల్గొన్న వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్

అవే అవస్థలు..

- మారని గ్రామీణ రహదారుల తీరు
- అడుగడుగునా గుంతలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



చిన్నబండపల్లి వద్ద రహదారి పరిస్థితి ఇదీ

పార్వతీపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రహదారుల తీరు ఇప్పటికీ అలాగే ఉంది. ప్రభుత్వం మారినా వీటి తీరు మారడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు ప్రధాన రహదారులు మరమ్మతులపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు తప్ప గ్రామీణ ప్రాంత రహదారులను పట్టించుకోవడం లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో ఎంత అధ్వాన స్థితిలో రహదారులు ఉన్నాయో ఇప్పటికీ అలాగే దర్శనమిస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని వెంకంపేట గోలీల నుంచి ఎంఆర్ నగరానికి వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయం దర్శనమిస్తోంది. లక్ష్మీనారాయణపురం రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామీణ రహదారులను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి

సత్యసాయి జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. నగర సంకీర్తన చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



భామిని: సొలికిరిలో నగర సంకీర్తన



సాలూరు రూరల్: మామిడిపల్లిలో..



పాలకొండ: ఉత్సవాల్లో పాల్గొన్న పడాల భూదేవి



బొబ్బిలి రూరల్: పిరిడిలో..

నాలుగు నెలలకోసారి ఉచిత గ్యాస్

పార్వతీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఉచిత గ్యాస్ సిలిండర్ ఇస్తారని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి సిలిండర్ ఏప్రిల్-జూలై, రెండో సిలెండర్ ఆగస్టు-నవంబరు, మూడో సిలెండర్ డిసెంబరు-మార్చి నెలల్లో ఇస్తామని స్పష్టం చేశారు. ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు.

గెస్ట్ టీచర్లను సీఆర్టీలుగా నియమించాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ టీచర్లను సీఆర్టీలుగా మార్చి వారికి జీతం పెంచాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. ఈ మేరకు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని లోకేష్ హామీనిచ్చారు.

విశాఖ బయలుదేరిన కళాకారులు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం బీచ్ రోడ్డులో జరగనున్న బిర్సాముండా జయంతి ఉత్సవానికి గుమ్మలక్ష్మీపురం చెందిన గిరిజన కళాకారులు శనివారం బయలుదేరి వెళ్లారు. గిరిజన ఉపాధ్యాయులు, గిరిజన కళాకారుడైన నాగభూషణ్ మాస్టార్ ఆధ్వర్యంలో ఈ బృందం బయలుదేరి వెళ్లింది. ట్రైబుల్ రీసెర్చ్ మిషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

జగదీశ్వరికి ఘన స్వాగతం



జగదీశ్వరికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

గరుగుబిల్లి/ గుమ్మలక్ష్మీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్‌గా నియమితులై తొలిసారిగా సొంత నియోజకవర్గానికి వచ్చిన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి శనివారం స్థానిక టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎం.పురుషోత్తం నాయుడు, ఎం.తవిటినాయుడు, డి.సత్యనారాయణ, ఎ.మధుసూదనరావు, అంబటి గౌరునాయుడు, ఎంటీ విజయవాంకుశం, ఎం.సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె తోటపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గుమ్మలక్ష్మీపురంలో కూడా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పాడి సుదర్శనరావు, బిడ్డిక పద్మ, కడ్రక కళావతి, పువ్వల లావణ్య పాల్గొన్నారు. ● పార్వతీపురం రూరల్: నర్సిపురం ప్రాంతంలో ప్రభుత్వ విప్ జగదీశ్వరికి కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ జీవీ నాయుడు, డొంకాడ రామకృష్ణ తదితరులు స్వాగతం పలికారు.

కురుపాంలో సన్మానం

కురుపాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి, వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా నియమితులైన శేఖర పాత్రుడు(తూర్పు కాపు కార్పొరేషన్), అక్కేనా మధుసూధన్(కొప్పల వెలమ కార్పొరేషన్), పువ్వల లావణ్య(రాష్ట్ర ట్రైకార్)లకు కురుపాం కోటలో శనివారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్, పార్టీ నాయకులు కోలా రంజిత్‌కుమార్, దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, కేవీ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన కల్పించాలి

గరుగుబిల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులకు ప్రకృతి సాగు విధానాలపై అవగాహన కల్పించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. శనివారం తోటపల్లి జట్టు నూతన కార్యాలయ ఆవరణలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస, బలిజిపేట మండలాలకు చెందిన 60 మంది కార్యకర్తలకు శిక్షణ అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని 15 మండలాల్లో అధిక విస్తీర్ణంలో అపరాలు సాగుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జట్టు సంస్థ వ్యవస్థాపకులు డా.డి.పారినాయుడు, ఎన్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ప్లాంటేషన్‌కు స్థల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెల్ల గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏఎన్ఆర్ ప్లాంటేషన్‌కు డీఎఫ్‌వో ప్రసూన శనివారం స్థల పరిశీలన చేశారు. ఏజెన్సీలో పది హెక్టార్లలో మొక్కలు నాటి అటవీ విస్తీర్ణాన్ని పెంచడానికి అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్నామని ఆమె చెప్పారు. ఫారెస్ట్ రేంజర్స్ గంగరాజు, మణికంఠేశ్వరరావు, సూర్య, సిబ్బంది ఉన్నారు.

ఇక ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు



మాట్లాడుతున్న వెంకట నాగసుందర్

బొబ్బిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు ఇక మీదట నేరుగా ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదులు పంపవచ్చని జిల్లా వినియోగదారుల కమిషన్ న్యాయాధికారి వెంకటనాగసుందర్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు వినియోగదారుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు లంక సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ రమణారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగసుందర్ మాట్లాడుతూ వినియోగదారులు తమ ఫిర్యాదులను కమిషన్‌కు నేరుగా ఆన్‌లైన్‌లో పంపించవచ్చని తెలిపారు. విచారణ ప్రక్రియను కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించే వెసులుబాటును కూడా త్వరలో కల్పిస్తారని ఆయన తెలిపారు. వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసిన వారికి తీర్పు వెలువడిన 45 రోజుల లోగా అప్పీలు చేసుకునే సౌకర్యం ఉందన్నారు. కొన్ని సందర్భాల్లో రూ.25వేల వరకు జరిమానా, జైలుశిక్ష పడే అవకాశం ఉందని పలు ఉదాహరణలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యురాలు బి.శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, మండలి ప్రతినిధులు బల్ల సింహాచలం, యూనియన్ నాయకుడు దేముడు పాల్గొన్నారు.

జయకృష్ణకు అరుదైన గౌరవం

పాలకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ సభ్యుడిగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జయకృష్ణకు ముఖ్యమంత్రితో పాటు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అరుదైన గౌరవం ఇచ్చారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ నాయకులు పల్లా కొండలరావు, గండి రామినాయుడు, గంటా సంతోష్‌కుమార్ శనివారం హర్షం వ్యక్తం చేశారు.

సత్తా చాటారు

- జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఏకలవ్య విద్యార్థినుల ఎంపిక



పోటీలకు ఎంపికైన కొటికిపెంట ఏకలవ్య విద్యార్థినులు

పాచిపెంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొటికిపెంట ఏకలవ్య పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థినులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. విశాఖ జిల్లా అనంతగిరి (అరకు స్పోర్ట్స్ స్కూల్) ఈఎంఆర్ స్కూల్ వద్ద నాలుగవ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్రంలోని 28 ఏకలవ్య పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. అందులో భాగంగా కొటికిపెంట ఏకలవ్య పాఠశాల నుంచి వివిధ క్రీడా విభాగాలకు సంబంధించి 42 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గోల్డ్, సిల్వర్ పతకాలు కైవసం చేసుకున్నారు. బాక్సింగ్ 45 కేజీలో రెండు బంగారు పతకాలు, అండర్-14లో నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే 45 కేజీల వెయిట్ లిఫ్టింగ్‌లో రెండు సిల్వర్, అండర్-19లో నాలుగు సిల్వర్ పతకాలు కైవసం చేసుకున్నారు. కొటికిపెంట ఏకలవ్య పాఠశాల నుంచి ఆరు బంగారు పతకాలు, ఆరు రజిత పతకాలను సాధించారు. ఈ 12 మంది విద్యార్థినులను కొటికిపెంట ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్‌సింగ్, పీఈటీ బుంటి, ఉపాధ్యాయులు అవినాష్ గౌరవ్, సత్తిబాబు, పీఎన్ యాదవ్, మహాలక్ష్మి రాహిచ్ అభినందించారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పాలకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నవంబరు 26న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని అఖిలపక్ష టీయూ సంయుక్త కిసాన్ మోర్చ మన్యం జిల్లా కమిటీ కన్వీనర్ బంటు దాసు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబరు 24వ తేదీ ఉదయం 9 గంటలకు పాలకొండలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణ నుంచి బైకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

● గుమ్మలక్ష్మీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 26న జరిగే ర్యాలీ, సభలను విజయవంతం చేయాలని రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా నాయకుడు గురుగుబిల్లి సూరయ్య కోరారు. ఈ మేరకు శనివారం గుమ్మలక్ష్మీపురంలో కరపత్రాలు ఆవిష్కరించారు.

న్యూస్ బాక్స్

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

గరుగుబిల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిలోని ఖడ్గవలస జంక్షన్‌లో శనివారం చోటుచేసుకుంది. పార్వతీపురం నుంచి గిజబ గ్రామానికి వెళ్తున్న ఆటో.. కడ్గవలస జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి రహదారిపై గోతుల కారణంగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న గిజబ గ్రామానికి చెందిన మండల చలపతి నాయుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

కోసలిలో అగ్ని ప్రమాదం

భామిని, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోసలి గ్రామంలో కుప్పిలి గౌరమ్మకు చెందిన పూరిల్లు శనివారం అగ్నికి ఆహుతయ్యింది. వీఆర్వో గోపాలరావు.. ఆర్ఐ కృష్ణారావుకు సమాచారం అందించారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.10 వేలు నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు.

పరీక్ష ఫీజుకు గడుపు పెంపు

వీరఘట్టం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు వచ్చే నెల 7వ తేదీలోగా వెయ్యి రూపాయల రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ తెలిపారు. శనివారం ఈ విషయాన్ని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మండల స్థాయిలో పీజీఆర్ఎస్

పార్వతీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, మున్సిపాల్టీల పరిధిలో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై సకాలంలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు అందరూ మండలాధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

గృహాల సర్వే వేగవంతం చేయాలి

సీతానగరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హౌస్ హోల్డ్ సర్వేను వేగవంతం చేయాలని పార్వతీపురం డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.త్రివిక్రమరావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల సర్వే పనులు, పారిశుధ్య పనులు, తాగునీరు సరఫరా, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పాలకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎంయూ డిపో కార్యదర్శి వి.రాజేష్ డిమాండ్ చేశారు. డిపో గేటు ఎదుట శనివారం నిర్వహించిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. డిపో మేనేజర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్యారేజ్‌లో పనిముట్లు లేక బస్సులు ఆగిపోతున్నాయన్నారు. ఎస్ఎంయూ నాయకులు పాల్గొన్నారు.